www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
గురువారం । 2 । ఏప్రిల్ । 2026




# హనుమాన్ జయంతికి కొండగట్టు ఆలయం ముస్తాబ్

- వెయ్యి మంది పోలీసులతో భద్రత
- నేడే హనుమాన్ జయంతి
- హనుమాన్ జయంతికి అన్ని ఏర్పాట్లు పూర్తి

జగిత్యాల, అక్షిత బ్యూరో:
జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న అలయంలో మార్చ్ 31 నుండి ఏప్రిల్ 02 వరకు మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలకు కొండగట్టు ముస్తాబయింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ అంజనారెడ్డి తెలిపారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు భక్తులకు తాగు నీటి సౌక ర్యం, మరుగుదొడ్ల నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దిగువ కొండగట్టులో ఏర్పాటు స్వాగత తోరణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.. మిగతా.. 2లో

# మద్యం మత్తులో సింగిల్ విండో ఆఫీస్

- సిట్టింగ్ రూంగా చైర్మన్ ఛాంబర్
- ఆఫీస్‌లోనే తప్పతాగి ఉద్యోగుల తందనాలు
- మోత్కూరు సింగిల్‌విండోలో ఉద్యోగుల మందు పార్టీ
- ఫొటోలు, వీడియోలు తీస్తున్న విలేకరులకు బెదిరింపులు

యాదాద్రి భువనగిరి / అక్షిత న్యూస్:
మద్యం మత్తుకు సింగిల్ విండో ఆఫీస్ నెలవైంది. ఏకంగా చైర్మన్ గదినిసిట్టింగ్ రూంగా మారింది. మోత్కూరు రైతు సేవా సహకార సంఘం కార్యాలయాన్ని (సింగిల్‌విండో) ఉద్యోగులు సిట్టింగ్ రూంగా మార్చి మందు పార్టీ చేసుకున్నారు. ఏకంగా చైర్మన్ ఛాంబర్‌లోనే దుకాణం తెరిచి మందు తాగారు. నిన్న అర్థరాత్రి వరకు మోత్కూరు సింగిల్ విండో కార్యాలయం తెరిచి ఉంచి యధేచ్ఛగా కార్యాలయంలోనే నలుగురు ఉద్యోగులు మందు తాగుతున్నారు. మోత్కూరు సింగిల్ విండో కార్యాలయ ఉద్యోగులతో పాటు నల్లగొండ గ్రామీణ సహకార బ్యాంక్ మోత్కూరు బ్రాంచ్ ఉద్యోగి పృథ్వి, అడ్డగూడూరు



సింగిల్‌విండో కంప్యూటర్ ఆపరేటర్ శివతో కలిసి నలుగురు ఉద్యోగులు మందు తాగుతున్న వారిలో ఉన్నారు. విధులు ముగించుకుని కార్యాలయం మూసేసి వెళ్లాల్సిన ఉద్యోగులు ఇలా కార్యాలయంలోనే మందు పార్టీ చేసుకోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు చైర్మన్ ఛాంబర్‌కు ఏమాత్రం విలువ ఇవ్వకుండా చైర్మన్ టేబుల్‌పై మందు బాటిళ్లు, బజ్జీలు పెట్టుకుని తాగుతున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు ఆరోపిస్తున్నారు.



# పేదింటి పెళ్ళిలకు ఆసరా

- పేదల కోసమే ప్రజా ప్రభుత్వం
- ప్రజాభవన్లో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

కరీంనగర్, అక్షిత బ్యూరో:
రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం పేదల కోసమే పని చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.బుధవారం ఎల్ఎండి కాలనీలోని ప్రజాభవన్ లో తిమ్మాపూర్ మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ

కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ పథకాల ద్వారా లక్షా నూటపదహారు రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన కుటుంబాలకు మిగతా.. 2లో

# దేశ భక్తిని చాటేందుకు యాత్ర

- భక్తి సేవ కలిసిన యాత్ర
- 15 వేల కిలోమీటర్ల ప్రయాణంతో ఆకట్టుకున్న సంజయ్
- మందమర్రిలో యాత్రికుడికి స్థానికుడి ఆతిథ్యం
- లోక కల్యాణం, గో పరిరక్షణకు ప్రత్యేక యాత్ర
- రోడ్ సేఫ్టీ కోసం సేఫ్టీ జాకెట్ అందజేసిన శివ శంకర్

మందమర్రి, అక్షిత ప్రతినిధి:
దైవభక్తిని చాటుతూ మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన సంజయ్ కారత్ అనే వ్యక్తి దేశవ్యాప్తంగా 15 వేల కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టాడు. దేశంలోని 12 జ్యోతిర్లింగాలను మిగతా.. 2లో



- మైనార్టీ సమస్యలపై నిర్లక్ష్యం.. ప్రజల్లో ఆగ్రహం
- మైనార్టీ జనాభా అధికంగా ఉన్నప్పటికీ శవయాత్ర వాహనం లేమి
- సీఎం బాసర పర్యటనలో వినతి ఇస్తారా? లేక హామీలకే పరిమితమా అన్న చర్చ

# భైంసాలో “ఆఖరి సఫర్” వాహనం డిమాండ్ మళ్లీ ముదిరింది

నిర్మల్, అక్షిత బ్యూరో:
నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ముస్లిం మైనార్టీ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు మళ్లీ చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా “ఆఖరి సఫర్” శవయాత్ర వాహనం లేకపోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2011 జనగణన ప్రకారం భైంసా పట్టణ జనాభా 49,764 కాగా, అందులో ముస్లిం మైనార్టీలు సుమారు మిగతా.. 2లో



# హనుమాన్ జయంతికి కొండగట్టు ఆలయం ముస్తాబ్

మొదటి పేజీ తరువాయి..

ఎండ తీవ్రత దృశ్య ఆలయ పరిసరాల్లో చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం స్వామివారి ప్రసాదమైన లడ్డు నాలుగు లక్షల సిద్ధంగా ఉందన్నారు. హనుమాన్ దీక్షాపరులు పెద్ద ఎత్తున కొండగట్టుకు వస్తారు కావున మాల విరమణ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. వాహనాల రద్దీ అత్యధికంగా ఉండడంతో కొండగట్టు నుండి జేఎన్టీయూ వరకు పది చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. మాల విరమణకు అర్చకులను, తలనీలాలకు కొండగట్టుకు తరలి వస్తున్న దీక్షపరులు కోసం అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్ని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు,. ఐదుగురు డిఎస్పీలు, 20 మంది సీఐలు, 80 మంది ఎస్ఐలతో పాటు 1000 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# పేదింటి పెళ్ళిలకు ఆసరా

మొదటి పేజీ తరువాయి..

ఈ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. పేద ఆడ పడచులు పెళ్లిళ్లకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నదని ఆయన వివరించారు. ఈ పథకాలు పేదలకు ఎంతో లాభదాయకంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల తాహసిల్దార్ కర్ర శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీగిరి రంగారావు,కుంట రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, పొన్నాల సంపత్, గొట్టిముక్కల సంపత్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పాలు రాము, రమేష్, నరేందర్ రెడ్డి, చింతల తిరుపతి రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రవీందర్ లక్ష్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఎం జ్యోతి,ఆర్.రమేష్ జీపీఓ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

# భైంసాలో "ఆఖరి సఫర్" వాహనం డిమాండ్ మళ్లీ ముదిరింది

మొదటి పేజీ తరువాయి..

23,357 (46.94%) ఉన్నారు. అయినప్పటికీ, శవయాత్ర కోసం ప్రత్యేక వాహనం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల ముఖ్యంగా పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.




ఈ నేపథ్యంలో స్థానిక ముస్లిం సంఘాలు, ప్రజాప్రతినిధులు కలిసి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఆఖరి సఫర్ " పథకం కింద భైంసా మున్సిపాలిటీకి శవయాత్ర వాహనం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మైనారిటీస్ వెల్ఫేర్ మరియు మున్సిపల్ శాఖలు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

ఇక మరోవైపు, మైనార్టీ సమస్యల పరిష్కారంలో స్థానిక నాయకత్వం విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ సహా పలు కీలక పదవుల్లో మైనార్టీ నాయకులు ఉన్నప్పటికీ, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న వేళ, ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర పర్యటన సందర్భంగా అయినా మైనార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారా? లేక మళ్లీ హామీలకే పరిమితమవుతారా? అన్న చర్చ పట్టణంలో కొనసాగుతోంది.

# యాదవ కురుమ ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమం జయప్రదం చేయండి

**-కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో మేకల మల్లిబాబు యాదవ్**

**ఖమ్మం /అక్షిత బ్యూరో:** ఈనెల 5న ఖమ్మం జిల్లా యాదవ కురుమల సర్పంచుల ఉప సర్పంచుల మార్కెట్ కమిటీ చైర్మన్ల మున్సిపల్ కౌన్సిలర్ల అధికార కాంగ్రెస్ పార్టీ ఏకైకయాదవ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కి జరిగే సన్మాన కార్యక్రమమును జయప్రదం చేయవలసిందిగా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు.

సన్మాన కార్యక్రమం ప్రచారంలో భాగంగా బుధవారం నాడు సన్మాన కరపత్రములను కారేపల్లి మండలంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ బీసీలలో అధిక జనాభా కలిగిన యాదవ కురుమలకు రాజకీయంగా జనాభాకు తగ్గట్టుగా ప్రాధాన్యత లేకపోవడం చాలా దురదృష్టకరమని ఇంకా కుల వృత్తిని మాత్రమే గౌరవంగా పూజించడం విద్యాపరంగా వెనుక పడటం ఐక్యత లోపించడం లాంటి అంశాల వలన రాజకీయంగా సామాజికంగా వెనుకబడి పోతున్నామని యాదవ్ కురుమల సంఘటిత లక్ష్యంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని కావున రాజకీయా లతీతంగా వర్గాల కతీతంగా పార్టీలకతీతంగా యువకులు మేధావులు రాజకీయ నాయకులు సన్మాన కార్యక్రమంలో



పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అడ్డగోడ ఐలయ్య మారబోయిన రాము దేగల ఉపేందర్ ఇమ్మడి తిరుపతి రావు ఉప సర్పంచ్ నన్నే బోయిన ఉపేందర్ బచ్చల కూరి నరేష్ నిజంగా నరేష్ చెవుల లక్ష్మీనారాయణ ఇమ్మడి సీత దేగల సైదులు రాబోతు నరసింహా గోసి రమేష్ పాలిక వీరస్వామి ఎనిక రవి గడ్డం వెంకటేశ్వర్లు బోళ్ల రమేష్ కదారి వెంకట్ మేకల కుమార్ గద్దమీది శ్రీను తోకల సాయి మేకల హరీష్ జంగా మధు ఏర్పాగి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదు:సిఐటియు

- **స్వాతంత్ర్యం నాటి నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయవద్దు.**
- **నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి**
- **సిఐటియు నాయకులు మోరంపూడిపాండురంగారావు**
- **సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొలిక పోగు సర్వేశ్వరరావు**




**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదని సిఐటియు జిల్లా నాయకులు సిఐటియు నాయకులు మోరంపూడి పాండురంగారావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొలిక పోగు సర్వేశ్వరరావు లు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మిక వ్యతిరేక మైన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని దేశవ్యాప్త నిరలసనల సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులను ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలు పరచాలని సిద్ధం చేసిందని దానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించినట్లు తెలిపారు.

కేరళ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులను తమ ప్రభుత్వం అమలు జరపబోదని అసెంబ్లీలో తీర్మానం చేసిందని అన్నారు.ఆ రీతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీలో లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కార్మికులు స్వతంత్రం నాటి నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజించే ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్ లనుఅమలుపరచాలా, వద్దా అనే నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసిందని అన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను అమలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రానున్న కాలంలో కార్మిక వర్గాన్ని సమీకరించి పెద్ద ఎత్తున పోరాటంలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ రావు రాధాకృష్ణ, నాగేశ్వరావు , ఖా న్ ,మధు, జగన్, నాగరాజు మస్తాన్ ,వెంకటేష్ ,శేష, ఏసు బాబు, మరియు తదితరులు పాల్గొన్నారు.

# దేశ భక్తిని చాటేందుకు యాత్ర

మొదటి పేజీ తరువాయి..

దర్శించుకోవాలనే సంకల్పంతో ఆయన 2024 నవంబర్ 1న సైకిల్‌పై ప్రయాణం ప్రారంభించారు. ఈ యాత్రలో భాగంగా గుజరాత్, నేపాల్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 11 జ్యోతిర్లింగాలను ఇప్పటికే దర్శించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేదార్నాథ్ వైపు ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మంచిర్యాల జిల్లా మందమర్రి మీదుగా వెళ్తుండగా, అలసటతో పాత బస్టాండ్ వద్ద బస్ స్టాప్‌లో విశ్రాంతి తీసుకుంటున్న సంజయ్ కారత్‌ను స్థానికుడు మర్రి శివ శంకర్ గమనించారు.

ఆయనతో మాట్లాడి స్వయంగా ఇంటికి తీసుకెళ్లి భోజనం ఏర్పాటు చేసి, ఆతిథ్యం ఇచ్చి సత్కరించారు. అనంతరం రోడ్డు భద్రత దృష్ట్యా సేఫ్టీ జాకెట్‌ను అందజేశారు.గతంలో 2022లో మర్రి శివ శంకర్ కూడా సైకిల్‌పై 12 జ్యోతిర్లింగాలను దర్శించిన విషయం ప్రస్తావనీయమైంది. సంజయ్ కారత్ తన స్వస్థలమైన అహ్మద్‌నగర్‌లో గోశాల నిర్వహిస్తూ ఉంటూ, లోక కల్యాణం మరియు గోవుల పరిరక్షణ కోసం ఈ సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.



# హజ్ యాత్రకు వెళుతున్న వారిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే నరేందర్

**కాశీబుగ్గ, అక్షిత న్యూస్:**

మహ్మద్ అబ్దుల్ తాహెర్ ను వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఘనంగా సన్మానించారు. వరంగల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ బాసిత్ తాహేర్ సౌదీ అరేబియాలో ఉన్న పవిత్రమైన ప్రదేశం మక్కహ్ కు ఉమ్రా చెయ్యడానికి వెళుతున్న సందర్భంగా వారిని వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ మండిబజార్ లో పూలమాల వేసి షల్వాలతో సన్మానం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు 20వ డివిజన్ అద్యక్షుడు ముహమ్మద్ ఇక్బాల్ , మాజీ కుడా డైరెక్ట మోడమ్ ప్రవీణ్ , సాంధని , షకీర్. మైనారిటీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదుగురు గంజాయి స్మగ్లర్లకు 20 ఏళ్ల జైలు శిక్ష

**వరంగల్, అక్షిత బ్యూరో:**

ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి స్మగ్లింగ్ కు పాల్పడిన ఐదుగురు నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్ట్ న్యాయమూర్తి బి. అపర్ణాదేవి బుధవారం తీర్పు చెప్పారు.

ప్రాసిక్యూషన్ కథనం మేరకు శాయంపేట, ఆత్మకూర్ మండలాలకు చెందిన పావురాల వెంకటేష్, అబ్బోజు వెంకటేష్,పరుపల్లి కార్తీక్, అనంతుల సాంబయ్య కొక్కరకొండ చంద్రయ్యలు సులభంగా డబ్బు



సంపాదించాలనే ఆలోచన నిందితులందరు, ఓ ముఠాగా ఏర్పడి, ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం ప్రాంతంలో పెద్ద మొత్తంలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, ఎక్కువ మొత్తంలో మహారాష్ట్రలో విక్రయించేందుకు, రహస్యంగా కార్లో స్మగ్లింగ్ పాల్పడుతున్న ఐదు నిందితులను ఆత్మకూరు పోలీసులు చౌలపల్లి గ్రామ శివారు ప్రాంతంలో అరెస్ట్ చేసి వీరి నుండి 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అప్పటి ఆత్మకూరు ఇన్స్పెక్టర్ రాజలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నేరం రుజువు కావడంతో న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. రాజమల్లారెడ్డి వాదించగా, ప్రస్తుతం ఇన్స్ స్పెక్టర్ ఆర్.సంతోష్,కోర్టు లైజన్ మహిళా ఆఫీసర్ కె. పరమేశ్వరి, కానిస్టేబుల్ ఆర్. ఉమేష్ పలువురు సాక్షులను కోర్టులో హాజరుపర్చారు.

# కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలి

## సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు

**కల్వకుర్తి, అక్షిత న్యూస్:**

నాలుగు లేబర్ కోడ్లను అమలును నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు కల్వకుర్తిలోని హైదరాబాద్ చౌరస్తా లేబర్ అడ్డా వద్ద పని ప్రదేశంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగినది.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడులను అమలు చేయాలని గత ఐదు సంవత్సరాల నుంచి ప్రయత్నం చేస్తూ వస్తున్నదని అనేకసార్లు కార్మికులు తీవ్ర వ్యతిరేకతలు తెలియజేస్తూ దేశవ్యాప్త సమ్మెలు నిర్వహించడం వల్ల కొంత వెనక్కి తగ్గినప్పటికీ నేటి నుంచి అమలు చేయడానికి పూనుకున్నదని ఇప్పటికైనా వాటిని రద్దు చేయకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉదృతం అయ్యే అవకాశం ఉందని ఇప్పుడిప్పుడే కార్మికులు అర్థం చేసుకుంటున్నారని అన్నారు.లేబర్ కోడులు అమలు అయితే కార్మికుల హక్కులకు భంగం కలిగే అవకాశం ఉందని పని గంటలు పెరగటం ,సమ్మె చేసే హక్కు కోల్పోవడం ,చిన్నచిన్న కారణాలు సాకుతో యూనియన్లను రద్దు చేయడం లాంటి చర్యలకు ప్రభుత్వం పాటుపడుతుందని ఇది బడా కార్పొరేట్ సంస్థలకు వ్యాపారులకు మేలు చేసే విధంగా ఉంటుందని అన్నారు. కేరళలో సిపిఎం ప్రభుత్వం లేబర్ కోడులను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేసిందని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మన రాష్ట్రంలో లేబర్ కోడులను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని అట్లయితేనే రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి మేలు చేసినట్లు అవుతుందని అన్నారు.



దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ముక్తకంఠంతో లేబర్ కోడలు వ్యతిరేకిస్తున్నదని రాబోయే రోజుల్లో లేబర్ కోడలు అమలు అయితే ఉద్యమాలు ఉధృతం అయ్యే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అమలైతున్న వెల్ఫేర్ బోర్డు నిధులు పక్కదారి మల్లిస్తున్నారని వృధా ఖర్చు ఎక్కువ చేస్తున్నారని హెల్త్ చెకప్ పేరుతో కోట్ల రూపాయలు దుర్వినియోగం అవుతున్నాయని అన్నారు.కార్మికులకు అమలవుతున్న వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పటాన్ని ఆపాలని అన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి యాదయ్య ఉపాధ్యక్షులు రాజు ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ వెంకటేష్ రామస్వామి రాజు మరియు ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మహేష్ గౌడ్, జంగయ్య, భాస్కర్, హమీద్, ప్రవీణ్ గ్రానైట్స్ అండ్ టైల్స్ హమాలి యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు, శ్రీశైలం, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు అరెస్ట్

**వరంగల్, అక్షిత బ్యూరో:**

తాళం వేసిన ఇళ్లల్లో చోరిలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.వీరి నుండి పోలీసులు కుమారు పది లక్షల రూపాయల విలువ గల 35 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు లక్షల నగదు,టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, మొబైల్ ఫోన్లు, వాచ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.



## అరెస్టైన నిందితులు

బింగి రఘు సోనూ (19)కొత్తూర్ జెండా, హనుమకొండ, మహమ్మద్ అసద్ (19),బొక్కలగడ్డ, హనుమకొండ చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ. పట్టుబడిన నిందితులు ఇద్దరు గంజాయి, మద్యం అలవాట్లకు బానిసలై, వారి జల్సాల కోసం అవసరమైన డబ్బు ను సులభంగా డబ్బు సంపాదించాలని నిందితులు నూతనంగా నిర్మాణంలో ఉన్న ఇళ్లలో




,తాళం వేసి ఇండ్లలో చోరీ చేసేందుకు సిద్ధపడ్డారు.దీనితో నిందితుల్లో ఒక్కడైన బింగి రఘు,సోనూ గత సంవత్సరం జనవరి మాసంలో హన్మకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు, కుమార్ పల్లి, సుబేదారి పరిధిలో శ్రీనగర్ కాలనీ తాళం వేసి వున్న ఇండ్లలో చోరీలకు పాల్పడి బంగారు నగలు, వెండి వస్తువులు మరియు నగదు చోరీకి పాల్పడగా, మరో నిందితుడు మహమ్మద్ అసద్ గత నెల మార్చ్ 23వ తేదీన కాజీపేట ప్రాంతంలోని బాపూజీ నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటిలో చొరబడి టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, మొబైల్ ఫోన్లు, వాచ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను దొంగిలించాడు.

ఈ చోరీలపై అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పోలీసులకు అందుబాటులో ఉన్న టెక్నాలజీ వినియోగించుకొని నిందితుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు.

బుదవారం హనుమకొండ బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న సమయంలో పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు తాము పాల్పడిన నేరాలను అంగీకరించారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు

నిందితులను పట్టుకోవడంలో చాకచక్య ప్రదర్శించి ప్రాపర్టీ రికవరీ చేసిన హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్, ఎస్సై పర్సు రాములు, క్రైమ్ పార్టీ అశోక్ రావుఫ్ లను సీపీ అభినందించారు.

# అడ్డదారిలో అనుమతులు లేకుండా అంబుజా సిమెంటు పరిశ్రమ పనులు చేస్తే సహించేది లేదు

### - పర్యావరణ పరిరక్షణ వేదిక

**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** అదాని లాజిస్టిక్స్ లిమిటెడ్ పేరుతో అంబుజా సిమెంట్ కాలుష్య పరిశ్రమ పనులు చేస్తే మరో మహా ప్రజా పోరాటం తప్పదని పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో-కన్వీనర్ ఎండీ రెహాన్ హెచ్చరించారు. రామన్నపేట అంబుజా సిమెంట్ ప్రతిపాదిత స్థలంలో భారీ యంత్రాలతో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న పనులను పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిల పక్షాల ఆధ్వర్యంలో స్థానిక నాయకులు పరిశీలించి పనులు అడ్డుకోవడం జరిగింది.

ఈ సందర్భంగా జల్లెల పెంటయ్య,ఎండి రెహాన్ మాట్లాడుతూ విష కాలుష్యంతో ప్రజల ప్రాణాలు తీసే అంబుజా సిమెంట్ పరిశ్రమ నెలకొల్పవద్దని మండల ప్రాంత ప్రజానీకం పెద్ద ఎత్తున ఆందోళన చేయగా వెనక్కి తగ్గి మళ్ళీ ఏదో సాకుతో పనులు ప్రారంభించడం సరికాదని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా భారీ యంత్రాలతో పనులు జరుపుతున్నారని ఏ నిర్మాణానికి అనుమతి ఉన్నదో ప్రజలకు మీడియా ముందు బహిరంగంగా చూపించాలని, స్థానిక గ్రామపంచాయతీకి సమాచారం అందించాలని అన్నారు. దొడ్డి దారిన పనులు ప్రారంభిస్తే ప్రాంత ప్రజలు చూస్తూ ఊరుకోరని మరో ప్రతిఘటన పోరాటం తప్పదని అన్నారు. రైతులకు మాయమాటలు చెప్పి నమ్మించి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి కాలుష్యంతో ప్రచారం దెబ్బతీసే అంబుజా సిమెంట్ పరిశ్రమను నెలకొల్పాలని చూస్తుంటే



ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ముక్తకంఠంగా వ్యతిరేకించారని దీనిపై జిల్లా కలెక్టర్,కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రజలకు బహిరంగంగా సమాధానం చెప్పాలని అడ్డదారిలో భారీ యంత్రాలతో పనులు చేస్తే సహించేది లేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక అఖిలపక్షాల నాయకులు మాజీ సర్పంచ్ గోదా శిరీష పృథ్వీరాజ్, ఊట్కూరు నర్సింహా, శానగొండ వెంకటేశ్వర్లు కొమ్ము శేఖర్, కొమ్ము రామస్వామి అంబాల అశోక్, గురిజాల మహేష్ రెడ్డి, జల్లెల మల్లేష్ సుదర్శన్,సమ్మయ్య,శీను వీరమళ్ళ లింగస్వామి, ఆకిటి శేఖర్, కల్లూరి శివ తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా అయ్యప్ప స్వామి జయంతి వేడుకలు

### అయ్యప్ప స్వామి ఆశీస్సులు పట్టణ ప్రజలపై ఉండాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** హరిహర సుతుడు అయ్యప్ప స్వామి కరుణా కటాక్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ,వెంకటరత్నం బాబు అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో మణికంఠ పూజ స్టోర్స్, హరిహర పూజ స్టోర్స్, నిర్వాహకులు అయ్యప్ప స్వామి భక్తుడు అర్వపల్లి నాగేందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వారి జన్మదిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజ



కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల కొరకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకకళ్యాణం కోసం నిర్వహించిన పూజలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులు నాగేందర్, శ్రీదేవి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లీశ్వరి, కౌన్సిలర్లు కందుల కోటేశ్వరరావు, తోట జ్యోతి శ్రీనివాస్, సైదిబాబు రాగమాలిక, పద్మ, శివ, మంగారావు, ముత్తారెడ్డి, నాగమ్మ పాల్గొన్నారు.

# మిషన్ భగీరథలో వేతనాల సంక్షోభం 4 నెలల బకాయిలపై కార్మికుల ఆగ్రహం

### అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం అందజేత

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** మిషన్ భగీరథ కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని,వెంటనే విడుదల చేయాలని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం సమర్పించారు. అనంతరం మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ నేటి నుండి సమ్మె కొనసాగుతుందని ప్రజలకు తాగునీరు అందించే కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కార్మికులను ఇలా నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.రోజువారీ జీవితాన్ని గడపడానికి కష్టపడుతున్న కార్మికులు వేతనాల కోసం నెల తరబడి ఎదురుచూడాల్సి రావడం అమానుషం అని తెలిపారు.

కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని,తక్షణమే పెండింగ్‌లో ఉన్న నాలుగు నెల వేతనాలను విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామని




పేర్కొన్నారు. లేకపోతే సమ్మె యధావిధిగా కొనసాగించడానికి కార్మికులు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ జిల్లా అధ్యక్షులు చాపిడి బాలేష్, పురుషోత్తం, వెంకటేష్, వేణు, దుర్గం కుమార్, పల్లె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భూములు కోల్పోయిన రైతులకు ఇండ్లు,స్థలాల పంపిణీ

**వరంగల్, అక్షిత బ్యూరో:** బుధవారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొనయమాకుల క్రాస్ రోడ్ వద్ద గల పీ.ఎస్.ఆర్ గార్డెన్‌లో కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో భూములు కోల్పోయిన సంగెం, గీసుగొండ మండలాల పరిధిలోని రైతులకు





బుధవారం రాజీవ్ కాలనీలో నిర్మిస్తున్న ఇండ్లకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి తో కలిసి పంపిణీ చేసిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి.

కార్యక్రమంలో భూములు కోల్పోయిన మండలాల లబ్ధి దారులు,వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను సద్వినియోగం చేసుకోవాలి

### సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్

**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** తుంగతుర్తి నియోజకవర్గం గొట్టిపర్తి గ్రామంలో బుధవారం నాడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం పది వారాలపాటు గ్రామ



వార్డు సభలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రత గంజాయి డ్రగ్స్ నిర్మూలన ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించుకోవడం కోసం వారానికి ప్రత్యేక విభాగం కార్యక్రమాలపై వారోత్సవాలను ప్రభుత్వం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్, టీం లీడర్ పల్లెల లక్ష్మణ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెల రాము, గ్రామ సర్పంచ్ చిలుకల వెంకన్న మంజుల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 99 రోజులో సర్పంచి నుంచి ఎమ్మెల్యే ఎంపీ వరకు ప్రజాప్రతినిధులు అందరిని భాగస్వామ్యం చేసి మండల పట్టణ నియోజకవర్గ కేంద్రాలలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్లు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వ అమలు కార్యక్రమాలను వివరించనుంది. ఈ కార్యక్రమంలో సంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీకాంత్, జిల్లా టీం లీడర్ పల్లెల లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెల రాము, గంట బిక్షపతి, గద్దం ఉదయ్, పాక ఉపేందర్, మాగి శంకర్, మద్దిరాల మంజుల, కుందమల్ల నాగలక్ష్మి, ములకలపల్లి మల్లమ్మ, సిరిపంగి రాధ, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## రంగారెడ్డి గూడలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, అక్షిత న్యూస్:** రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడం లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక పెద్ద ఆస్తి అని, ఇలాంటి పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని పేర్కొన్నారు.

### మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు

## 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

**- జిల్లా యస్.పి డి.జానకి.**

**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుండి 30వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ




సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఇట్టి విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు.

అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## గ్రామ సభల నిర్వహణపై సమీక్ష

**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి డి ఎం ఆర్ ఈ డి సి ఓ సంతోష్ నారాయణ అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం మండల పరిధిలోని 13 గ్రామపంచాయతీలలో నిర్వహించనున్న గ్రామ సభల ఏర్పాట్లు, కార్యాచరణపై చర్చించారు.ఈ సమావేశంలో గ్రామ



పంచాయతి ప్రత్యేక అధికారులు,మండల స్థాయి అధికారులు, పంచాయతి కార్యదర్శులు,జి పి ఓ లు పాల్గొన్నారు.

గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.రాగ్యా నాయక్,ఎంపీడీఓ ఎం.డి.మోసిన్ బిన్ అహ్మద్, ఎంఈఓ వరలక్ష్మి,మండల వ్యవసాయాధికారి తదితర శాఖల అధికారులు హాజరయ్యారు.

# అక్రమ ఇసుక రవాణాపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు

### అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లు సీజ్ : జిల్లా కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోంది. కాగజ్‌నగర్ పెద్ద వాగు ప్రాంతం నుండి రెబ్బెన మండలంలోని రాంపూర్ గ్రామానికి ఎలాంటి అనుమతి పత్రాలు, ట్రాక్టర్ డాక్యుమెంట్లు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు. బుధవారం భూగర్భ జలాలు అడుగంటి పోతున్న నేపథ్యంలో



ఆక్రమ ఇసుక రవాణాపై జిల్లా కలెక్టర్ హరిత ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ ఏ.ఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. వెంటనే స్పందించిన అధికారులు మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం ఆసిఫాబాద్ మండల పరిధిలో పెద్ద వాగు



సమీపంలో తనిఖీలు నిర్వహించిన ఆసిఫాబాద్ ఎస్సై జాడే శ్యామ్ రావు, కమలాకర్ నేతృత్వంలోని పోలీసు బృందం నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని సీజ్ చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలతో పాటు ఇసుక

తరలించే వారిపై చట్టపరమై. న చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. హరిత హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సహజ వనరులను దోపిడీ చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

### ప్రత్యేక నిఘా - ప్రజల సహకారం అవసరం

జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతున్నదని కలెక్టర్ తెలిపారు. ప్రజలు కూడా ఇటువంటి అక్రమ కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## సీఎంఆర్ చెక్కుల పంపిణీ

**- లబ్ధిదారుల ముఖాల్లో ఆనంద కిరణాలు**

**- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు**

**నాంపల్లి, అక్షిత న్యూస్:** మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్) చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేక ఇబ్బంది. పడుతున్న పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ సహాయం ఆశాకిరణంగా నిలుస్తోందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల నాయకులు హాజరై లబ్ధిదారులకు స్వయంగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు 77 చెక్కులు పంపిణీ చేయడం జరిగింది ఇందుకుగాను 28 లక్షల 48 వేల ఐదు వందల రూపాయల లబ్ది ప్రజలకు చేకూర్చడం జరిగిందన్నారు.ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం ఎవరూ డబ్బుల కొరతతో వైద్యం లేక ఇబ్బంది.



పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని అందిస్తున్నాం అని తెలిపారు.

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అనేక మంది లబ్ధిదారులు పాల్గొని ఇటీవల ప్రమాదాలు అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారు ఈ సహాయం ద్వారా కొంత ఉపశమనం పొందుతున్నామని తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వం మా వెంట నిలవడం ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. అంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల పార్టీ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్ ఉపసర్పంచ్లు అధికారులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యుత్ పనుల్లో భద్రతా పరికరాలు తప్పనిసరి - ఉత్తమ్ జాడే

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:**

క్షేత్రస్థాయిలో విద్యుత్ పనులు నిర్వహించే ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా భద్రతా పరికరాలు ధరించి పనిచేయాలని ఉత్తమ్ జాడే సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆసిఫాబాద్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్, ఎర్త్ రాడ్ వంటి భద్రతా పరికరాలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేయరాదని ఆయన తెలిపారు.

ఇప్పటికే పలుమార్లు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, కొన్ని చోట్ల భద్రతా పరికరాలు ఉపయోగించకుండా పనిచేయడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుని, విలువైన ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు బాధాకరమని పేర్కొన్నారు. ఇకపై భద్రతా నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

"ప్రాణం అమూల్యమైనది. ఉద్యోగుల భద్రత మా అగ్రప్రాధాన్యత" అని ఎస్.ఈ. స్పష్టం చేశారు. పలు మార్లు విద్యుత్ ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందని , ప్రమాదాలు జరగకుండా సిబ్బందికి భద్రత సూత్రాలు పాటించాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు కార్యక్రమాలు చేపట్టామని, అందులో భాగంగా ఎల్సీ (ఎల్ సి) యాప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా లైన్ క్లియరెన్స్ (ఎల్ సి ) ప్రక్రియను సులభతరం చేసి, తప్పిదాలను నివారించవచ్చని వివరించారు.

ఎల్సీ యాప్‌లో సంబంధిత ఫీడర్‌పై ఏఈకి రిక్వెస్ట్ ఇవ్వడం, ఆ ఆధారంగా సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు సమాచారం చేరడం జరుగుతుందని చెప్పారు. లైన్ మెన్ అవసరమైన జాగ్రత్తలు, పని వివరాలు యాప్‌లో నమోదు చేయాలని, పని పూర్తయ్యాక అదే యాప్‌లో రిటర్న్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

ఈ విధానం పూర్తిగా సురక్షితమైనదిగా, ప్రమాదాల నివారణకు అత్యంత ఉపయోగకరమైనదిగా పేర్కొన్నారు.

జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా సర్కిల్‌లోని డి.ఈ (టెక్నికల్) అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం అన్ని సెక్షన్ కార్యాలయాల్లో "పెప్ టాక్" నిర్వహిస్తూ, ఉద్యోగులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

ప్రతి ఉద్యోగి జీవితం ఎంతో విలువైనదని, భద్రతే మా అగ్రప్రాధాన్యత అని ఎస్.ఈ. మరోసారి స్పష్టం చేశారు.

# 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలి

**ఏప్రిల్ 6 నుంచి 11 వరకు**
**వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యక్రమాలు**
**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ అక్షిత బ్యూరో:** 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 6 నుంచి 11 వరకు జిల్లా వైద్య శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.

బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో



నిర్వహించే కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 6న ఆహార భద్రత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ మేరకు ఈట్, రైట్, వాక్ కార్యక్రమంలో స్థానిక చౌరస్తా నుంచి నెహ్రూ పార్కు వరకు ఆశాలు, ఏఎన్ఎంలు, విద్యార్థులు, ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఆహార రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించాలన్నారు.

ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో పనిచేసే ఉత్తమ వర్కర్ లను గుర్తించి, సత్కరించాల



న్నారు. ఏప్రిల్ 8న రక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సురక్షిత ప్రసవాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి, పోషకాహారంపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు.

ఏప్రిల్ 9న ఎయిడ్స్ నియంత్రణపై రెడ్ రన్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్ వర్గాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే ఎయిడ్స్ నివారణపై కళాజాతలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏప్రిల్ 10న హోమియోపతి, ఆయుష్ దినోత్సవం సందర్భంగా కేజీబీవీల్లో, యోగా కేంద్రాల్లో యోగా సాధన చేయించాలని, అలాగే ఆయుష్ పై ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

ఏప్రిల్ 11న మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై వ్యాస రచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి, అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డీసీహెచ్ఎస్ శర్మ, డీడబ్ల్యూఓ కోదండరాములు, ఆహార భద్రత అధికారి వినీల్ కుమార్, ప్రోగ్రామింగ్ అధికారులు, వైద్యులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకరమే ప్రభుత్వ లక్ష్యం

**నూతన గృహ ప్రవేశాలు చేయించిన ఎమ్మెల్యే,కలెక్టర్**

**వరంగల్, అక్షిత బ్యూరో:** పేదల జీవితాల్లో వెలుగులు నింపడం, సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు.

బుధవారం గీసుగొండ మండలం వంచనగిరి గ్రామంలో మైనాల శ్రావణ్ కుమార్ నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గృహాన్ని ప్రారంభించి, లబ్ధిదారులను శాలువాతో సన్మానించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. పేదల కళ్లలో ఆనందం నింపడం ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# కొండగట్టు అంజన్న ఆలయం ముందు కూలిన చలువ పందిళ్లు..

**15 మంది భక్తులకు గాయాలు..**

**జగిత్యాల, అక్షిత బ్యూరో:**
కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం చిన్న హనుమాన్ జయతి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది.కేశఖండన చేసుకునే భక్తుల కోసం వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులకు గాయాలయ్యాయి, పందిరి పక్కనే విద్యుత్ తీగలు తెగి పడిపోగా తృటిలో పెను ప్రమాదం తప్పింది.

హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి దర్శనానికి భారీగా భక్తులు తరలి వచ్చారు.ఈ ప్రమాదంలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏర్పాట్లు మొక్కుబడిగా, నాసిరకంగా ఉండటం వల్లే ప్రమాదం సంభవించిందని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## ఖమ్మం మహిళా ప్రాంగణంలోని మామిడి తోటలోని మామిడి కాయలు వేలం

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం) టేకులపల్లి ఖమ్మం నందు గల మామిడి తోటలోని మామిడి కాయలు ఆక్షన్ వేయుటకు గాను నిర్ణయించినట్లుగా మహిళా ప్రాంగణం అధికారిణి వేల్పుల విజేత ఒక ప్రకటనలో తెలిపినారు.ఆక్షన్ నందు ఆసక్తి గల వారు ది. 04.04.2026 లోపు తమయొక్క వివరాలను మహిళా ప్రాంగణం కార్యాలయం నందు నమోదు చేపించుకోగలరు. వేలంపాట ది. 06.04.2026 మధ్యాన్నం 3.00 గంటలకు కలదు.పూర్తి వివరాల కొరకు కార్యాలయ పనిదినములో ఉ॥ 10.30 నుండి సా॥ 5.00 లోపు మహిళా ప్రాంగణం ఆఫీసు నందు సంప్రదించగలరు. లేదా ఫోన్ నెంబర్ 7660022512 నందు సంప్రదించగలరు.



## మహంకాళి కిరణ్‌ను పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ 4 వ వార్డుకి చెందిన మహంకాళి కిరణ్ స్థానికంగా రాడ్ బెండింగ్ పని చేసుకుంటూ కుటుంబంతో కలిసి జలగం నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల రాడ్ బెండింగ్ పని చేస్తూ ప్రమాదవషాత్తు బిల్డింగ్ మీద నుండి పడి కాలు చెయ్యి విరిగి హాస్పిటల్ లో చికిత్స అనంతరం వారు ఇంటికి రాగ స్థానిక వార్డు కౌన్సిలర్ బోయిన కుమారి సంగయ్య ద్వారా



విషయం తెలుసుకొని కిరణ్ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి ప్రమాదానికి గల కారణం తెలుసుకొని విచారం వ్యక్తం చేసిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్. రోజు వారి కూలి కావటం వల్ల వారికి నిత్యవసర సరుకులు బియ్యం వైద్య ఖర్చుల నిమిత్తం తన సొంత నిధుల నుండి 3,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో పాటు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు బోయిన సంగయ్య కొట్టం రంజిత్ రెడ్డి మునగాల నాగయ్య అబ్దుల్ క్రిష్ణ శ్రీనివాస్ భద్రా చారీ తదితరులు పాల్గొన్నారు.

## రాయగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ బోయిన వేణు

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో రాయగూడెం గ్రామంలో 10లక్షల వ్యయంతో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బోయిన



వేణు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్ నంబూరి రామారావు గ్రామ సెక్రెటరీ బైర్ లక్ష్మీనారాయణ నంబూరి నరేంద్ర లక్క నాగరాజు బోయిన కృష్ణయ్య పందిటి వెంకటేశ్వర్లు కాలింగి గురవయ్య పందిటి కోటేశ్వరరావు జిడుగు బ్రహ్మం నాయుడు సురేష్ ఎడవల్లి తిరపయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతిలో విద్యార్థుల విజయోత్సవం

## పాల్గొన్న ప్రతి పోటీలో బహుమతులు

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** కష్టపడి పని చేస్తే విజయం ఖాయం అని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. విజయం యాదృచ్ఛికంగా రాదని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం, క్రమశిక్షణ, కృషి, పట్టుదల కలిసివస్తేనే విద్యార్థులు విజయాలు సాధిస్తారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విశ్వశాంతి విద్యార్థులు సత్తుపల్లి ప్రాంతంలో వివిధ సంస్థలు నిర్వహించిన పోటీలలో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి అనేక బహుమతులు,




ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన "విద్యార్థుల విజయోత్సవం" కార్యక్రమంలో విజేతలను ఘనంగా సన్మానించారు.

### సాధించిన విజయాలు

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా 15వ బెటాలియన్ పోలీసులు నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ, తృతీయ స్థానాలు

జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవం సందర్భంగా ఆర్టీసీ నిర్వహించిన వ్యాసరచన పోటీలో మొదటి మూడు బహుమతులువందేమాతరం ఫౌండేషన్ నిర్వహించిన పోటీలలో ఆరు బహుమతులుజన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తృతీయ స్థానంభగవద్గీత క్విజ్ పోటీలో మండల స్థాయిలో ద్వితీయ స్థానం రామకృష్ణ సేవా సమితి నిర్వహించిన డివిజన్ స్థాయి పోటీలలో ప్రశంస పత్రాలు.అలాగే సత్యసాయి సేవా సమితి తదితర సంస్థలు నిర్వహించిన పోటీలలో కూడా విద్యార్థులు విజేతలుగా నిలిచారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం సత్య నారాయణ, అవినాష్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# రామన్నపేటలో అంబేద్కర్ 135వ జయంతికి భారీ ఏర్పాట్లు

## అంబేద్కర్ ఉత్సవ కమిటీ కన్వీనర్ బొడ్డు సురేందర్‌రావు, కో-కన్వీనర్‌గా నాగటి ఉపేందర్

**రామన్నపేట అక్షిత ప్రతినిధి:**

రామన్నపేట మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అంబేద్కర్ వాదులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక రహదారి బంగ్లాలో సోమవారం సమావేశం నిర్వహించి జయంతి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కమిటీ కన్వీనర్‌గా బొడ్డు సురేందర్‌రావు, కో–కన్వీనర్‌గా నాగటి ఉపేందర్, సోషల్ మీడియా



కన్వీనర్‌గా ఎర్ర నరేష్‌ను ఎంపిక చేశారు. అదేవిధంగా మరో 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి అంబేద్కర్ అభిమానులను సమీకరించి, మండల కేంద్రంలో భారీ ర్యాలీతో జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులుగా నల్ల స్వామి, నోముల చిరంజీవి, కంచి మధుసూదన్, కోళ్ల రామకృష్ణ, కక్కిరేణి విజయ్‌కుమార్, భాష మల్ల సంతోష్, గాదె నరేందర్, నకిరేకంటి నరేందర్, బొడ్డు శంకర్, జనపాల లక్ష్మణ్, నకరికంటే మొగులయ్య, బలుగూరి అంజయ్య, ఏలూరి రవిలు ఎన్నికయ్యారు.

# ఓపీ, ఐపీ కేసులు - రోజువారి సేవలపై ప్రత్యేక దృష్టి

## విద్యార్థినులకు పోషకాహారం అందించాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ అక్షిత బ్యూరో:** బుధవారం, జిల్లాలోని జఫర్గఢ్ మండల పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోజూవారిగా వస్తున్న ఓపీ (ఔట్ పేషెంట్), ఐపీ (ఇన్ పేషెంట్) కేసుల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రసవాల కేసులు, గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో చర్చించారు. ప్రసవాల సంఖ్యను మరింతగా పెంచాలని సూచించారు. వార్డుల్లో రోగులకు అందుతున్న చికిత్సపై ఆరా



తీశారు. డెంటల్ విభాగం, స్కానింగ్ సెంటర్ పనితీరును పర్యవేక్షించారు. ఔషధాల నిల్వలను పరిశీలించి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. డయాలసిస్ తీసుకుంటున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న సేవల గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.

ఆరోగ్య కేంద్రాల పరిసరాల పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ, నిల్వ విధానాలను తనిఖీ చేసి, సరైన ప్రమాణాలు పాటించాలని సూచించారు.

ఈ క్రమంలో మౌలిక వసతులు మెరుపరచాలని, వైద్యులు,





సిబ్బంది సమయానుగుణంగా అందుబాటులో ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జఫర్గఢ్ మండలంలోని సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలను కలెక్టర్ సందర్శించి, వంటశాలను తనిఖీ చేశారు. వంటకు ఉపయోగించే సామాన్లు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం పరిశుభ్రంగా ఉండాలని, పోషకాహారం అందించాలని సూచించారు.

పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్ వినియోగాన్ని కూడా పర్యవేక్షించారు.

పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడి, రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు.


ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో మొక్కజొన్న పంటలకు నష్టం....!

## మండల వ్యవసాయాధికారి పరిశీలన


**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** ఆర్మూర్ మండలంలో గత రాత్రి కురిసిన అకాల వర్షాల ప్రభావంతో మొక్కజొన్న పంటలు నేలకొరిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మండల వ్యవసాయాధికారి శ్రీహరి కృష్ణ,పిప్రి,పత్తపూర్, గ్రామాలలో పంటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్షాల తీవ్రత కారణంగా పంటలు విస్తారంగా నేలకొరిగినట్లు గుర్తించారు. అదేవిధంగా, మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ)లు పంటల పరిస్థితిని పరిశీలిస్తూ నివేదికలు సేకరిస్తున్నారు.

పంట నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, పై అధికారులకు త్వరలోనే నివేదిక సమర్పించనున్నట్లు అధికారులు



తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





# శ్రీ పాంచాలరాయ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే,కలెక్టర్

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట గ్రామంలోని శ్రీ పాంచాలరాయ స్వామి (శ్రీ కృష్ణ) బ్రహ్మోత్సవాల్లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ పాంచాలరాయ స్వామి దర్శనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే,కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాచీన ఆలయాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఆలయానికి అవసరమైన సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. తరువాత గ్రామ ప్రజాప్రతినిధులు అతిథులను శాలువాతో సన్మానించారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలి

## రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల బాధ్యత కీలకం
### - ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆసిఫాబాద్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో Arrive Alive కార్యక్రమం నిర్వహించారు. ఆసిఫాబాద్ పట్టణ కేంద్రం లోని ఆటో, ట్రాలీ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ




కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ హాజరై, పలు అంశాలు వివరించారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆటో మరియు ట్రాలీ డ్రైవర్లు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాహనాలలో అధిక లోడ్‌తో ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై హెవీ లోడ్‌తో ప్రయాణించరాదని స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అనుమతించిన పరిమితిలోనే ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు.




అలాగే వాహనాల ఫిట్‌నెస్, బ్రేకులు, లైట్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం తనిఖీ చేసుకోవాలని తెలిపారు. రాత్రి సమయంలో రిఫ్లెక్టివ్ స్టికర్లు, లైట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఆకస్మికంగా ఆపడం, వేగంగా మలుపులు తిప్పడం వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం నేరమని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఐటికోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, ఆసిఫాబాద్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్స్ కమలాకర్, చంద్రశేఖర్, సీనియర్ రెసిడెంట్ ఆప్తామాలజిస్ట్ జీ. పవన్, హౌస్ సర్జన్ అబ్బాస్ అలీ పాల్గొన్నారు.

# నూత్‌పల్లి గ్రామంలో ఆయిల్ పామ్ అవగాహన సదస్సు నిర్వహణ

**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈరోజు ఆయిల్ పామ్ పంటపై అవగాహన సదస్సు మరియు సాగు యాజమాన్య పద్ధతులపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఆయిల్ పామ్ రైతులు, అలాగే పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సదస్సులో భాగంగా ఆయిల్ పామ్ సాగులో పాటించాల్సిన ముఖ్యమైన మెలకువలు, సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం గురించి నిపుణులు వివరించారు. 2022-23 సంవత్సరంలో సాగు ప్రారంభించిన రైతులకు 2026 నాటికి దిగుబడి వస్తుందని తెలిపారు. తోట సాగు ప్రారంభించినప్పటి నుంచి మొదటి 30 నెలల వరకు పూతను తొలగించాలని సూచించారు.

అలాగే రైతులు సమయానికి ఎరువులు వేయడం, తోటలో కలుపు లేకుండా పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పంటను ఆరోగ్యంగా కాపాడుకోవచ్చని వివరించారు. ప్రస్తుతం ఒక టన్ను ఆయిల్ పామ్



గెల ధర రూ. 21,546గా ఉందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ సంధ్యరాణి, ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కిరణ్, నిఖిల్, ఏఈవో మౌనిక, నూత్‌పల్లి సర్పంచ్ రాజారెడ్డి, ఉప సర్పంచ్ నర్సారెడ్డి, గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో కాజీపేట ముందంజ : ఎమ్మెల్యే నాయిని

**కాజీపేట్, అక్షిత న్యూస్:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపాలని సంకల్పంతో ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. గత పాలనలో కాజీపేట తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి కొత్త దిశగా సాగుతోందని స్పష్టం చేశారు.

99 రోజుల ప్రణాళిక ప్రగతి పాలనలో భాగంగా, 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ రోడ్డులో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి శంకుస్థాపన చేశారు.




ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో రాజకీయ ప్రయోజనాల కోసం శిలాఫలకాలు మాత్రమే ఏర్పాటు చేసి పనులు వదిలేసిన ఉదాహరణలు ఉన్నాయని,ప్రస్తుతం అలాంటి పరిస్థితులకు ముగింపు పలికి, శంకుస్థాపన చేసిన పనులను వేగంగా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయిస్తూ, కాజీపేట రూపురేఖలను పూర్తిగా మార్చే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

కాజీపేటలో వైద్య రంగంలో కూడా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టామని, ప్రజలు గత పాలనతో పోల్చి ప్రస్తుత ప్రభుత్వ పనితీరును అర్థం చేసుకోవాలని సూచించారు. కొంతమంది నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్, బస్ స్టాండ్ వంటి అంశాలపై ఆందోళనలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని, ప్రజల మద్దతుతో కాజీపేటను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.





# మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్

## రోడ్డుపై వృథాగా పోతున్న నీరు

**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** ఆలూర్ మండలంలోని మిర్దపల్లి రోడ్డులో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు లీకేజ్ ఏర్పడి అనేక రోజులుగా కొనసాగుతోంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో విలువైన తాగునీరు వృథాగా పోతుంది.

పైప్‌లైన్ లీక్ కారణంగా నీరు రోడ్డుపై ప్రవహిస్తూ బురదమయంగా మారింది. దీంతో ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనాలు స్కిడ్ అవుతూ ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. స్థానికులు, ప్రయాణికులకు ఇది ప్రమాదకరంగా మారింది.

అలాగే గత కొన్ని రోజులుగా నిరంతరం నీరు కారుతుండటంతో రోడ్డుపై చిన్నపాటి కుంటలను తలపించేలా నీరు నిల్వవుతోంది. దీని వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

స్థానికులు పలుమార్లు గ్రిడ్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం గమనార్హం. మెయిన్ పైప్‌లైన్ లీక్ కారణంగా నీరు పొలాల్లోకి చేరి పంటలకు నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లీకేజీని తక్షణమే సరిచేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.


# సలేశ్వరం జాతరకు భారీగా తరలి వెళ్లిన భక్తులు

## భక్తుల పర్యవేక్షణ పరిశీలిస్తున్న డి.ఎస్.పి పల్లె శ్రీనివాసులు

**అచ్చంపేట,అక్షిత ప్రతినిధి:** లింగాల మండలం నల్లమలలోని దట్టమైన అడవిలో సలేశ్వరం జాతర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇట్టి జాతర 200కు పైగా పోలీసు సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలగకుండా బద్ధబస్తు ఏర్పాటు చేశారు. దట్టమైన అడవిలో భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అచ్చంపేట డిఎస్పి పల్లె శ్రీనివాసులు. లింగాల ఎస్ఐ వెంకటేష్ గౌడ్. లింగాల తాసిల్దార్ బి వెంకటేష్. డిప్యూటీ



తాసిల్దార్ కృష్ణా జి. తోపాటు డిటిడిఓ ఫిరంగి తోపాటు ప్రభుత్వ గిరిజన పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హైదరాబాద్ అచ్చంపేట ఈగలపేట బల్మూర్ తదితర ప్రాంతాల ఎస్ఐలు సలేశ్వరం జాతర బంధ బస్సులో పాల్గొని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. ప్రకృతిసిద్ధంగా కొండల కింద గుహలు ఉన్నాయి. పూర్వకాలంలో పాండవులు అరణ్యవాసం పూర్తి చేసి అజ్ఞాతవాసానికి వెళ్లారు. అదే సమయంలో వారు ఇక్కడ బస చేసినట్లు తెలుస్తోంది. పంచపాండవులు అజ్ఞాతవాసం అంతా సలేశ్వరం గుహల్లో చేశారని పూర్వీకుల కథనం. వారు ఇబ్బందిపడకుండా ఉండేలా.. ఈ క్షేత్రానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానది నీటిని శివుడు ఇక్కడికి రప్పించినట్లు చెబుతారు. ఎత్తైన కొండగుహలపై నుంచి దిగువకు జలపాతం పారుతుంది. ఇక్కడ శివపార్వతులు తపస్సు చేసినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. సలేశ్వరాన్ని మొదట శైలపురంగా పిలిచేవారని, రానురాను సలేశ్వరంగా పేరు మారిందంటున్నారు. ప్రతి ఏడాది చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా పుణ్యస్నానాలు చేయడానికి భక్తులు ఇక్కడికి వస్తారు. గుహలో వెలసిన లింగమయ్యకు చెంచులు పూజారులుగా వ్యవహరిస్తున్నారు. సలేశ్వరం జాతర ఉత్సవాలు మరో రెండు రోజులు మూడవ తేదీ వరకు కొనసాగుతున్నట్లు తెలిపారు.